# చావుపుట్టుకలే ఆయనవి , బతుకంతా ప్రపంచానిది

పాతతరం , కొత్త తరానికి కేవలం జ్ఞాపకాలనే కాకుండా నిండు స్ఫూర్తిని కూడా అందజేస్తుంది . వాళ్ళ భుజాలనెక్కి దూసుకొచ్చే కాలప్రవాహాన్ని అంచనా వేసి తగు చర్యలు తీసుకోమంటుంది . ఆ పాతతరం నాయకులు సత్యాన్వేషకులైతే , తాము దర్శించిన దర్శనాల్లోంచి , ఆచరణ బాటలోంచి భావి తరాలవారికి మనోబలాన్ని సృష్టించిపోతారు . అటువంటి హృదయ చక్షువులతో ప్రపంచాన్ని దర్శించిన అరుదైన నేతల్లో రామ్మనోహర్ లోహియా ఒకరు . ఈయన మహాత్మాగాంధీకి దగ్గరి అనుయాయే కానీ భావాలలో అవసరమైతే ఆయనతోనూ విభేదించే స్వతంత్రాలోచనా వుంది . దగాపడుతున్న వాడికి న్యాయం జరగాలంటే తాను నమ్మిన సోషలిజం మూలాలనూ ప్రశ్నించే సాహస ప్రవృత్తి వుంది . జర్మనీలో చదువుకున్నాడు . ప్రపంచ మార్పులను గమనించాడు . తిరిగివచ్చి గాంధీజీతో దేశ స్వతంత్రోద్యమంలో పాల్గొన్నాడు . దేశమంతా సంచరించేదుకే సమయం సరిపోని వ్యక్తి గనుక పెళ్లి కూడా చేసుకోలేదు . భారతదేశంలో సోషలిస్ట్ ఉద్యమాన్ని నిర్మించాడు . 1950 ల్లో ప్రపంచమంతా పర్యటించాడు . ఆయన అనుభవాల్ని “ రాజకీయాల మధ్య తీరికవేళలు “ అనే తన పుస్తకంలో పొందుపరిచారు . సమాజంలో ఘర్షణలు ఎందుకొస్తున్నాయ్ ? సమానత్వం ఎందుకు లేదు ? వాటి మూలాలేంటి ? వాటిని పరిష్కరించడం ఎట్లా ? అనేదే లోహియా సమగ్ర రచనల సారం . అందుకు తన పరిధిలో చేయాల్సినదంతా చేసాడు .

ఓసారి లోహియా న్యూయార్క్ లో పర్యటిస్తున్నపుడు రాత్రుల్లో ఆ నగరమంతా తిరిగి , నిజ జీవితంలో భూతాలూ , దెయ్యాలు నమ్మని తనకు మైళ్ళ పొడవులోనున్న ఆ బహుళ అంతస్తుల భవనాలను చూసి అవి భూతాలే అన్నంత భయమేసిందని చెప్పుకున్నాడు . ఒకవేళ శత్రువు బాంబుతో దాడి చేసినపుడు ఆ బిల్డింగుల మాటేమోగానీ , దాని కింద నలిగి చనిపోయే మనుష్యుల మాటేమిటనే ఆలోచననే తన మనసును కకావికలం చేసిందని రాసుకున్నాడు . అలాంటి అమెరికాను చూసినపుడు జనించిన భయోత్పాతం తన జీవితంలో తనకెప్పుడు మళ్ళీ సంభవించలేదు అని రాసుకున్నాడు . సరిగ్గా 50 సంవత్సరాలకు అదే న్యూయార్క్ లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ మీద జరిగిన దాడీ , దాని కింద నలుగుతున్న మనుష్యుల ఆర్తనాదాలు , టీవిల్లో ప్రత్యక్షంగా చూసినవారి చెవుల్లో ఇప్పుడికీ భయంకరంగా మోగుతూనే వుంటాయి . మరి లోహియా ఏమైనా కలగన్నాడా ? లేదు . దార్శనికుడైన ఓ రాజనీతిజ్ఞుడి అంతర్దృష్టి అది . ఆయన అప్పటి అమెరికన్ సమాజంలో క్యాపిటలిజం ఎదుగుతున్న తీరును , దాని వికృత రూపాన్నీ గమనించాడు . ప్రపంచాన్ని శాసించే అధికారం యూరప్ నుండి అమెరికాకు బదిలీ కావడమూ చూసాడు . కాబట్టి అట్లాంటి ఎదుగుదల స్వభావానికి ఫలితాలేట్లుంటాయో ఊహించాడు .

ఆయన ఈ లోకాన్ని వదిలి 50 ఏళ్ళు కావొస్తుంది . కానీ ఇప్పటి సందర్భం , శకలాలు శకలాలుగా విడిపోయి ఉన్న సమాజ సందర్భం . నేను గెలిస్తే అమెరికాకు ఎదురులేని ప్రపంచ సార్వభౌమాధికారాన్ని కట్టిపెడతానంటూ ప్రపంచాన్ని వణికిస్తూ , రంకెలేస్తున్న డోనాల్డ్ ట్రంప్ ని అమెరికన్ రిపబ్లికన్ సమాజం ఆమోదిస్తున్న సందర్భం . నీవు భారతమాతకు జై అనకపోతే ఈ దేశంలో ఉండొద్దు అని హుకుం జారీ చేసే నేతలకు చప్పట్లు కొడుతున్న సందర్భం . భారత్ మాతాకు జై అని ఎందుకు అనాలి ? నేను అనను , అని మరో వర్గపు నేతలు అంటే చప్పట్లు కొడుతున్న సందర్భం . ఈ దేశంలో నా పుట్టుకే ఓ శాపం అని బాధపడుతున్న రోహిత్ ల ఆగ్రహపు ఆందోళనలను టెర్రరిస్ట్ , యాంటి నేషనల్ అని ముద్రవేసి ప్రభుత్వాలే వారి గొంతును అణచివేస్తున్న సందర్భం . అధికారం కోసం మనుష్యులని కేవలం కులాల పేరుతొ రెచ్చగొట్టి , వోట్లుగా మలచుకుని , ఆ ప్రజల బాగోగుల్ని గాలికి వదిలేస్తున్న సందర్భం .

ఇది ఓ విచిత్రమైన గ్లోబలైజ్డ్ , లిబరలైజ్డ్ సందర్భం . గాయం అవుతుంది . అందరూ శత్రువు ఎక్కడా అని వెతికేవాళ్ళే . ఆ గాయంలో తన పాత్రకూడా ఎంతోకొంత వుందని తెలిసినా నిజాన్ని ఒప్పుకునే ధైర్యంలేక , నీవంటే నీవని ఒకరిమీద ఒకరు దుమ్మెత్తి పోసుకుంటారు . నాయకులకు గానీ , వ్యవస్థలకుగానీ మనుష్యులు ప్రాంతాలుగా , మతాలుగా , జాతులుగా , కులాలుగా మరింతగా విడిపోయి ఘర్షించుకోవడం ఇష్టం . అలా జరిగితేనే తనకూ లేదా తన సంస్థకు ప్రాధాన్యం పెరిగి , గుర్తింపు , గెలుపు వస్తాయి . అటువంటప్పుడు ఏదైనా గాయానికి మూల కారణం కనుక్కోవాలంటే , సత్యం తెలుసుకోవాలంటే భయం అతనికి . సత్యం తెలిస్తే తనకు అధికారం , గుర్తింపూ ఉండదనే అభద్రత అతనికి . అతనికి ప్రజల్లో ఎంత గందరగోళం ఉంటే అంత లాభం కాబట్టి ప్రజలను కూడా విడగొట్టి గందరగోళపరుస్తాడు .

విచిత్రం ఏంటంటే ఈ నాయకులు కూడా మన లాంటి ప్రజల్లోనుండి తయారైన వారే . ఆ ప్రజల ఆమోదం ఎంతో కొంత వుంది కాబట్టే నాయకులు అలా తయారు అవుతారు . సమాజంలోని దు:ఖానికి సమాజమే కారణమవుతుంది . అయితే కారణాన్ని నిష్పక్షపాతంగా తెలుసుకోవడానికి సమాజానికి అవకాశం అంతంత మాత్రమే . ఎందుకంటే అది శకలాలు శకలాలుగా విభజించబడ్డది . సమాజంలో ఏదో ఒక శకలంలో భాగమై , గుర్తింపును , భద్రతను పొందడంతో తృప్తి పడి సత్యం తెలుసుకోడానికే సాహసించని మేధాతరగతి ఒకటి . ఇంకొకడి మీద గెలుపు వాంఛలతోనో , ఆర్థిక , సామాజిక ఉన్నతితోనో ఎప్పుడూ అగ్ర భాగాన ఉండాలి కాబట్టి సత్యాన్ని చూడడానికే ఇష్టపడని ఉన్నతతరగతి రెండోది . ఈ గ్లోబలైజేషన్ కాల ప్రవాహంలో కొట్టుకపోతూ , తన కుటుంబ సుఖమే ముఖ్యమనే కంఫర్ట్ జోన్ లో ఉంటూ ఎదో కదిలీ , కదలనట్లు నటించే మధ్యతరగతి మూడోది . దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకునే అవకాశమూ లేకుండా , ఉన్నత వర్గం స్వార్థానికీ , ప్రలోభాలకు లొంగే వారిగా మార్చబడి , అట్టడుగున్నే ఉంచబడ్డ

దిగువ తరగతిది నాలుగోది . ఈ నాలుగు తరగతులను దాటి ఎవరైతే సమస్యకు మూల కారణాన్ని , సత్యాన్ని కనుక్కొని విశ్వమానవ ప్రేమతో ఆత్మిక ,ఆర్థిక సమానత్వాన్ని ప్రపంచానికి అందజేయాలనుకుంటారో , గాయాలను , ఘర్షణలను రూపు మాపాలనుకుంటారో అటువంటి నిస్వార్థ జీవులదే ఈ ఐదో తరగతి . లోహియాలాంటి వారందరూ ఈ ఐదో తరగతికి చెందుతారు . ఇటువంటి లోహియాలు ఎంత ఎక్కువ మంది ఏ దేశంలో ఉంటే ఆ దేశం వీలైనంతవరకు ఘర్షణలు లేని దేశంగా మారుతుంది . కానీ ఇపుడు మనదేశంలో ఇటువంటి వ్యక్తులు అత్యంత అరుదుగా ఉన్నారు .

లోహియా కాలంలో శత్రువు బాహ్యమైనవాడు కాబట్టి , వాడు ఎవడో స్పష్టంగా గుర్తించే కాలం అది . దాని మీద పోరాడడానికి ప్రజల్ని చైతన్యపరిచి కదిలించగలిగారు . ఈ గ్లోబలైజుడ్ , క్యాపిటలైజుడ్ కాలంలో శత్రువు ఫలానా అని గుర్తించడానికి వీలులేని కాలం . ఇది అంతర్గాతమైనది . స్తబ్ధతకు , భద్రతకు, సౌకార్యానికి , చైతన్య రాహిత్యం , స్వార్థం అనే విషపు కోరల్లో చిక్కుకున్న మనిషి మనస్తత్వమే ఇపుడు దేశానికి శత్రువు , అందుకని అంతర్గతంగా ఉన్న శత్రువు బయట ఎట్లా దొరుకుతాడు ? . ఈ కాలం , వ్యక్తి కేంద్రీకృత పోటీ కాలం . ఒకడు ఇంకొకడి గురించి ఆలోచించడానికో , వినడానికో కూడా సమయం దొరకని కాలం లేదా విన్నట్లు నటిస్తున్న కాలం . తనను తనలాగా ఉంచకుండా జరుగుతున్న ఈ నిరర్థక పోటీలో , ఎక్కడ వెనుకబడుతానోనన్న భయంతో పరుగెడుతున్న కాలం . ఎదో ఒక శకలం తో ఐడెంటిఫై చేసుకుని భద్రతను కోరుకుంటున్న కాలం . నేను బాగుంటే చాలు అనుకునే కాలం . కానీ ఇట్లాంటి మనస్తత్వమే ముదిరి కొంత కాలానికి నేను మరింత బాగుండడానికి ఎదుటివాడికి ఏమైతే నాకేంటి అనేదిగా మారుతుంది . ఇది ఇంకా ముదిరి ఎదుటివాడిని ఏమి చేసైనా సరే నేను ఇంకా బాగుండాలి అనేదిగా మారుతుంది . ఆ స్తబ్ధత భూతమే మహా రాక్షసిగా మారి ఒక్కొక్కరి మీద దాడి చేస్తూ అందరినీ గాయపరుస్తుంది . దాని ఫలితాలు దేశంలో కుల , మత ఘర్శణలతో రక్తం పారిస్తుంది ; ఒకరినొకరు ద్వేషంతో , ఈర్ష్యతో , అభద్రతతో కొట్టుకుంటు హింస వైపు లాక్కెళ్తుంది ; మనకు తెలియకుండానే అవినీతిలో భాగమై , ఆర్థిక అసమానతలను పెంచి , సమాజంలో అసూయాలను రగిల్చి , అశాంతికి కారణమయ్యేట్లు దాడి చేస్తుంది ; ఈ అంతర్గత శత్రువులను మేల్కొల్పుతున్న ఈ గుర్తు తెలియని రాక్షస స్వైరవిహారంలో అందరం బాధితులమే , అందరం భాగస్వామ్యులమే అయినా , దాని ఎరుక కూడా లేకుండా పరుగు తీస్తున్న కాలం ఇది . ఇటువంటపుడు లోహియాలు ఏం చేస్తారనేది ప్రశ్న ?

వ్యవస్థలోని ఈ ఒక్క ఉదాహరణతోనే ఈ పరిస్థితిని అంచనా వేయచ్చు . ఇపుడు రాజకీయాలు లాభసాటి వ్యాపారాలు . ఒక్కోడు ఎం.ఎల్ .ఏ కావడానికే 10 నుండి 20 కోట్ల పెట్టుబడి పెట్టి గెలవడానికి సిద్ధపడుతున్నపుడు దానికి కనీసం మూడు రెట్లన్న రిటర్న్స్ రాబట్టుకోకుండా ఎలా ఉంటాడు ? క్యాపిటలిస్టు వ్యవస్థతో చేతులు కలుపుతాడు . ప్రజల

భాగస్వామ్యమున్న సహజ వనరులతో పాటు , ప్రజల చైతన్యాన్ని , హక్కుల్ని , ఆత్మాభిమానాన్ని కూడా కబ్జాచేస్తాడు . అనేక రకాలుగా సమాజం చుట్టూరా అవినీతిని నాటుతాడు . దానికొరకు దండకారణ్యంలోని గిరిజనుల మీద లీగల్ గానే యద్ధం చేసినట్లుగానే రేపు మన మీదా ఎదో రూపంలో లీగల్ గానే యుద్ధం చేసి మనల్ని మనం తాకట్టు పెట్టుకునేలా చేస్తాడు . అపుడు ఎవడి గోడు ఎవడు వింటాడు . అంతా లీగల్ గానే జరుగుతుంటది కానీ శత్రువు దొరకడు . ఒక కోటి పెట్టుబడి అయిదేళ్ళలో కనీసం 5 కోట్లుగా మారుతున్న ఈ సమాజంలోకి వచ్చి లోహియా ఏం చేయగలడు ? దేశానికి విధానాలు నిర్ణయించి , దిశా నిర్దేశం చేసే రాజకీయ వ్యవస్థకే ఇలా వైరస్ పడితే , దాని ప్రభావం అన్నిటిమీదా పడి దేశాన్ని అతలాకుతలం చేస్తుంది . అటువంటి ఈ స్థితిలో , సాక్షాత్ లోహియానే ఎలక్షన్ లో పోటీ చేస్తే డిపాజిట్ దొరుకదు అనే దాంట్లో సందేహం అక్కర్లేదు . డబ్బే , కులమే , మతమే గెలుస్తుంది అనే బలమైన నమ్మకం ప్రజల్లో నాటుకుపోయింది . అది సరియైన దారి కాదు అని అంటూనే అందరం అందులో భాగస్వాముల్యలం కావడమే అత్యంత విషాదం . ఇటువంటపుడు లోహియాలు ఏం చేస్తారనేది ప్రశ్న ?

ఇలా వ్యవస్థలోనే లోపం ఉన్నపుడు లోహియా ఏం చేసేవాడో అని పిస్తుంటుంది . ఓసారి ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్ స్టీన్ దగ్గరికెళ్ళి ‘‘ఇపుడు ప్రపంచాన్ని ఇద్దరు ఆకర్షిస్తున్నారని అందులో ఒకరు గాంధీ , రెండోది మీరు . అయితే గాంధీ ప్రపంచాన్ని కలిపేందుకు అహింసా శాంతి మంత్రాల్ని బోధిస్తే మీరు హింసను , భయాన్ని కలిగించే ఆటంబాంబును కనుక్కున్నారని ‘‘ నిర్మొహమాటంగా ఆయన మొహమ్మీదే లోహియా చెప్పేసరికి ఐన్ స్టీన్ మొదట ఖంగుతిని తరువాత లోహియా సత్యత్వాన్ని ప్రస్తుతిస్తాడు . కమ్యూనిస్ట్ యుగోస్లేవియాకు వెళ్లి , అక్కడి కమ్యూనిజాన్ని విషపు కోరలు ఉన్నదానిగా , అమెరికాకు వెళ్లి , క్యాపిటలిజాన్ని భయంకర భూతంగా వర్ణించిన లోహియా జీవితాన్ని , నైజాన్ని తెలిసిన వారెవరైనా ఒకటి మాత్రం చెప్పగలరు : ఈ కాలంలో ఆయనే ఉంటే పదవులనే ఆశని నేలకు కొట్టి , ఇల్లిల్లు , వీధి వీధి తిరుగుతూ మనకు పట్టిన చెదలు పురుగుల్ని విప్పి, మన జడత్వాన్ని బండకేసి కొట్టేవాడు . రోహితు , కన్నయ ల పోరాట ఆగ్రహాన్ని ఇంకో కోణంలో దర్శించేవాడు . కులాల కుంపటితో వందల ఏళ్లుగా ఈ దేశం తమని కలుపుకోలేక పోయిందనే వర్గాల ధర్మాగ్రహపు జ్వాలను అర్థం చేసుకునేవాడు . దార్శనికుడుగా, వారి ఆగ్రహపు మాటల మూలాలలోకి వెళ్లి గాయపడ్డవారికి స్వాంతననిచ్చే చర్యలను ప్రతిపాదిస్తూ , అపార్థాలను దూరం చేసేవాడు .

ఈ లోహియానే ఒకప్పుడు , మంత్రి పదవిని ఇస్తాను తన క్యాబినెట్ లోకి రమ్మని ఆహ్వానించిన నెహ్రూతో , ప్రతిపక్షమైతే ప్రశ్నిస్తూ ప్రజల తరపున పోరాడతాము అని తిరస్కరించి నెహ్రూ ప్రభుత్వాన్ని నిరంతరం మేలుకునేట్లు

చేసాడు . అటువంటి లోహియా  ఈ కాలంలో ఉంటే , ఈనాటి కలహాల ట్రంపులకు  ; జాతీయత గురించి  తమకే పేటెంట్ హక్కున్నట్లు లక్ష్మణ రేఖల్ని గీస్తున్న  మతతత్వపు  నేతలకు  బహుళత్వంలోని జీవనసౌందర్యాన్ని , భిన్నత్వంల్లోని ఏకత్వపు మాధుర్యాన్ని కళ్ళకు కట్టినట్లు వివరించేవాడు  ; తమ అధికారానికి , స్వార్థానికి మతాల , కులాల పేరుతొ మనుష్యుల్ని చీల్చుతున్న నేతల్నీ  ; సమస్యలకు మూలాలను తామూ తెలుసుకోకుండా ,  ప్రజలను సత్యం తెలుసుకోనీయకుండా  గందరగోళపరుస్తున్న క్యాపిటలిస్ట్ నేతల్నీ  వీధికీడ్చి , వారి భండారం బయటపెడుతు ఊరూరా చాటేవాడు . ఆయనే ఓసారి “ మనుష్యులకు పునర్జన్మలున్నాయని నమ్మను కానీ ,  ఓ దేశానికి మాత్రం వుంటుంది . ఎందుకంటే , దేశాన్ని బాగుచేసుకోవాలని  చేపట్టే ఇప్పటి మంచి చేర్యలె రేపటి తరాల వారికి మంచి ఫలితాల రూపంలో పునర్జన్మగా అందుతాయి “ అన్నాడు . అందుకైనా అతను నిరంతరం మెళకువతో వుంటూ , సమాజాన్ని ఎరుకలో ఉంచేవాడు .

“ సోషలిజానికి శాశ్వత నిర్వచనాలు వుండవంటూ , నిత్యం దాన్ని ఎవరికివారు కొత్తగా కనుక్కోవాల్సింది “ అనే ఆయన మాట బుద్ధుడిలాంటి మాట .  విశ్వమంత హృదయంతో అందరిని తనలో , అందరిలో తనను చూసుకునే వారే మహానేతలు . వారి వెంట  జనాలు ఉండనీ లేకపోనీ ; పరిస్థితులు అనుకూలించనీ , లేకపోనీ ;  పదవులు ఉండనీ లేకపోనీ కానీ వారు మాత్రం  తానున్న మేర , తానున్న పరిసరాల్లో తన ఆచరణజ్యోతి అనే కాగడా పట్టుకుని పొద్దున్నే విశ్వైక్యసమతారాగాన్ని పాడుకుంటూ  గడప గడపకు తిరిగి మనుష్యుల్ని మేల్కొల్పుతారు   . ఈరోజు కాకున్నా రేపన్నా మార్పు రాకపోతదా అనే ఆశని కల్పిస్తారు . అటువంటి మహా నాయకుల్లో  రామమనోహర్ లోహియా ఒకరు  . పుటుక ఆయనది , చావు ఆయనది  కానీ మాత్రం  బతుకంతా ప్రపంచానిది .

( 27 న  , హైదరాబాద్ లో ఆయన 106 వ  జయంతి ఉత్సవాలు జరుగుతున్న  సందర్భాన  )

ఏ .గంగారెడ్డి

బెడ్ ఫోర్డ్  యూనివర్సిటీ ( UK )  అలుమ్ని

9000022443